చిత్రసమీక్ష:

'పాండురంగ మాహాత్మ్యం'

కామి కానిదే యోగి కాడంటారు. అయితే యోగి కావడానికి కామిగా అఘాయిత్యాలు చేయడం అవసరమా? కామిగానో, ఇంకొకడుగానో అఘాయిత్యాలు చేసే వాళ్లందరూ యోగులో భక్తులో అవుతారని చూస్తూ ఊరుకోవలసిందేనా? పూర్వజన్మకృతం ప్రకారం జీవి నడుస్తాడు కనుక ఈ లోకంలో ఏ జీవి మంచిచేసినా, చెడు చేసినా-దానికి ఆ జీవిని సంజాయిషీ అడగనవసరం లేదా? సంజాయిషీ చెప్పినా, చెప్పాలని అంగీకరించినా సినిమాలకు కథలు కరువవుతాయ్. అందులోనూ మున్ముందు భక్తుడు కావలసిన జీవి ఇప్పుడు ఎన్ని అఘాయిత్యాలు చేసినా చూస్తూ ఊరుకోకపోతే సినిమా ఏమవుతుంది చెప్పండి?

వీటన్నింటికీ కాకపోయినా కొన్నింటికి కొంతవరకూ పాండురంగమహాత్మ్యం (పుండరీకుని కథ) సమాధానం చెబుతుంది. కథలో ఇతివృత్తానికీ శీర్షికకూ ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలేమీ లేకపోవడం కథాచమత్కృతి. ఏమూలనో వాడిన ఒకమాటనో ఓ వాక్యాన్నో ఓ కథకు శీర్షికగా పెట్టడం రచన గొప్పతనానికి లక్షణమైనట్లు, ప్రసిద్ధ కావ్యం పాండురంగమహాత్మ్యంతో అసలు సంబంధం లేకుండా పుండరీకుడి కథను వెండితెరకెక్కించి పాండురంగమహాత్మ్యం అన్నారు.

భక్త తుకారాం, సిద్ధజ్ఞానేశ్వర్ ప్రభృతి భక్తకోటి పాండురంగనిలో కైవల్యం పొందిన సన్నివేశాలు చిత్రించేరను సమర్థించకపోవు. అయితే పుండరీకుడు భక్తుడు ఎట్లాఅయినాడూ? తల్లిదండ్రులను సేవించడంవల్ల. చాలా సులభమైనమార్గమేసుమా!

ఈ చిత్రంలోనేకాదు సినిమాల్లో కనిపించే విచిత్రజీవుల చిత్రమేమిటంటే అవి అసాధారణజీవులు. ఒక సినిమాలో ఒకడు తనభార్యను మొదట్లో అందలం ఎక్కిస్తాడు. తరువాత దాసీకంటేకూడా హీనంగా ఛీత్కరిస్తాడు. కథ అయిపోవచ్చేప్పటికో అయిపోతూండగానో, ఆ భార్యనే మళ్లీ ముఖ్య నాదేవత అంటాడు. అదికథ. సినిమాల కథ. సరిగ్గా పుండరీకుడూ అంతే.

అయితే డబ్బులేకనో, ఉద్యోగంలేకనో తల్లిదండ్రులను మొదట నిర్లక్ష్యంచేసి, అవమానించితే అది ఇంకో సినిమా అవుతుంది. ఇందులో అట్లాకాదు. పుండరీకుడు దర్జాగా గుఱ్ఱమెక్కి తిరుగుతూంటాడు. కనిపించిన ప్రతిఆడదానికీ కన్నుగొడ్తాడు. ఆఖరికి ఇంటికొచ్చేప్పటికి భార్యకనిపిస్తే ఈలవేసి కన్నుగొడ్తాడు. అంత గొప్పవాడు పుండరీకుడు. అంత గొప్పకామి. అంతకామంలో తల్లిదండ్రులభక్తి, పూజాపునస్కారాలను ఛీత్కరించుకుని వాళ్ళు దూరంగావెళ్లేట్టు చేసుకుంటాడు. ఆతరువాత భార్యను హీనంచేసి ఇంట్లో నగలూ, సొమ్మూ - అదీ ఇదీ ఏమిటి మొత్తం ఆస్తినే ప్రియురాలికిరాసిచ్చేస్తాడు.

"ఏమండీ అవునా?" అని భార్యఅడిగితే



"సత్యం...రాసిచ్చేశాం" అంటాడు. అని ప్రియురాలు తిరస్కరించగా ఆమెను చంపబోతాడు. ఆ ప్రియురాలు ఎన్నుకొన్న ప్రియుడు వెనుకవాటుగా చావుదెబ్బగొడ్తాడు. బయటికినెట్టి తలుపులేసుకొంటుంది ప్రియురాలు. ఇక అడవులలోబడి తిరుగుతూ తిరుగుతూ ఓచోట ఓ భాగవతోత్తముణ్ణి హింసించబోగా కాళ్ళు రెండు పోతవి. పశ్చాత్తాపం కలుగుతుంది. తరణోపాయం చెప్పమని అడుగుతాడు. మీ అమ్మానాన్నల సేవే తరణోపాయం. అంటాడు భాగవతోత్తముడు. అంతటితో జ్ఞానోదయమై అమ్మా, నాన్నా అంటూ బయల్దేరతాడు పుండరీకుడు. బయల్దేరడమేమిటి నేలమీద దేకుతూంటాడు.

కలలో ఆ అరుపులువినిపించి పుండరీకుడి తల్లిదండ్రులు కూడా కొడుకుకోసం తిరిగి వస్తూండగా దోవలో కుంటి కొడుకును చూచి తల్లి బాధపడేలోగానే-పుండరీకుడు ఆమె కాళ్లు పట్టుకుని ఏడుస్తాడు. అయ్యో నా కొడుకు కుంటివాడయినాడని ఆమె బాధపడడానికైనావ్యవధి లేకుండానే పుండరీకుడికి కాళ్ళూ భక్తీవచ్చేస్తయ్. అంతటితో కామిగా, అఘాయిత్యంగా తిరిగిన పుండరీకుడు భక్తుడవుతాడు.

"కృష్ణా...గోవింద ముకుంద—మురారీ" అనగానే "భక్తా పుండరీకా" అంటూ కృష్ణుడు పరుగెత్తుకొచ్చేంత భక్తుడైపోతాడు. అంత గొప్ప భక్తుడికి అసాధ్యమేముంటుంది కనుక, తల్లిదండ్రులకూ భార్యకూ ఇంకా ఇతరులకూ మోక్షం ఇప్పించేస్తాడు. అక్కడినుంచీ పుండరీకుడి కథ పాండురంగమహాత్మ్యం అవుతుంది ఈ సినిమా కథలో.

ప్రేక్షకులను మెప్పించాలనే ప్రయత్నం చాలా ఉన్నది ఈ చిత్రంలో. అయితే ఆ ప్రయత్నంలో జాగ్రత్తపాలు తక్కువయిందనిపిస్తుంది. పురాణం చెప్పించారు. మళ్ళీ పురాణంలోనే కథను పూర్తి చేస్తే ఎట్లా ఉండేది? ప్రారంభంలో ఇంద్రుడి శాపం సంగతి ఉన్నది. కథకూ ఆ శాపానికీ సంబంధం సంగతి ఎట్లా ఉన్నా, ఆదంతా చూడడానికి కావలసిన ఉత్సాహం ఆ సన్నివేశాలవల్ల కలగడం లేదేమో. పైగా ఎబ్బెట్టుగా కూడా ఉన్నయ్యేమో?

పుండరీకుడి కామజీవితం చూపించడంలో పడిన ప్రయాసలో కనీసం సగం శ్రద్ధఅయినా భక్తిసాధన జీవితం చూపించడంలో అవసరం కాదా?

పుండరీకుడి తండ్రిగా శ్రీ నాగయ్య ప్రశంసనీయంగా నటించారు. ఆయన కోడలుగా ప్రతిభ చూపించే అవకాశం ఈ చిత్రంలో శ్రీమతి అంజలికి ఇవ్వలేదేమో?

భర్తయింటినుంచీ బయల్దేరి తండ్రిదగ్గరికి వెళ్ళి, భర్తయింటికొచ్చి, ఆయన దేశం మీదికి పోయినాడని తెలుసుకుని ఆయనను వెదుక్కుంటూపోయేలోగా సినిమాలో ఆమెసంగతే తెలియదు. ఆ తరువాత అసలు ఆమె అవసరమే కథలో కనిపించదు. అంతే అప్పటికసలు పుండరీకుడి పాత్రే పూర్తి కావస్తూంటుంది.

పశ్చాత్తాపం ఉత్తమమార్గమే కావచ్చు. అయితే నిజంగా పశ్చాత్తాపం కలిగిందన్న నిదర్శనమేమిటి? తల్లిదండ్రుల కాళ్లుకడిగి పూజించాడుగా అంటారు. అదివరకైనా వాళ్ళను పుండరీకుడు హింసించినట్లు చిత్రంలో చూపించలేదు. కాకపోతే భజనలనూ, అతిథిసత్కారాలనూ ఏవగించుకుంటాడు. ఏమైనా పుండరీకుడి భక్తిసాధనకు ఇంకా కొంచెం ప్రాముఖ్యమిచ్చి వుంటేబాగుండేదేమో!

ప్రేక్షకుల అపేక్ష, అభిమానం సంపాదించడానికి ఖరీదైన సెట్లున్నవి ఈ చిత్రంలో. కానీ, ప్రధాన ఇతివృత్తానికీ, ఆ సెట్లకూ అంతకంటే ఎక్కువ సంబంధం కలిపించివుండవలసింది. సంభాషణలు బాగు

న్నవి. కథ నడిచినకొద్దీ పాటలు స్పష్టంగా వినిపించినవి. ఛాయాగ్రహణం అంత అపూర్వంగా లేదు. సన్నివేశాలను సమన్వయం చేయడంలో ఇంకా కొంచెం శ్రద్ధ అవసరమనిపిస్తుంది. పేకేటి శివరాం, శంకర, వెంకటసుబ్బయ్యలే వారు నటించిన పాత్రలకు విధిగా అవసరమనిపించదు. పద్మనాభయ్య నటన బాగున్నది.

వికగింపు కలిగించని శృంగారం వున్నది. అందుకు సరిపడే నృత్యాలున్నవి. డబ్బు చేసిపెట్టడానికి అది కొంత ఉపయోగపడవచ్చు. మొత్తంమీద ఈ నేషనల్ ఆర్టు థియేటర్సువారి పాండురంగ మహాత్మ్యం చిత్రాన్ని ఆంధ్రులు ఆదరిస్తారు. అయితే పాటల రికార్డింగ్‌లో ఇంకా కొంచెం శ్రద్ధ వహించివుంటే "చెబితే చెవికెక్కందా గురుగురూ" లాంటి పాటలు జనంలో వలిగే అవకాశం ఎక్కువయ్యేది. ★

—వి. ఎస్. వ]

"ఇంద్రజిత్"

చంద్రికా ఫిలింస్‌వారి తొలి కానుక 'ఇంద్రజిత్' చిత్రనిర్మాణాన్ని దర్శక నిర్మాత ఎల్. వి. ప్రసాద్ నవంబరు 17 న ప్రారంభోత్సవం చేశారు. ఆరోజున పాటల రికార్డింగు జరిగింది. మాటలూ పాటలూ సముద్రాల వ్రాస్తున్నారు. సంగీత దర్శకుడు అశ్వత్థామ.

ఈ చిత్రంలో ఎన్. టి. రామారావు, ఎస్. వరలక్ష్మి, సుమ్మది, కాంతారావు, పి. హేమలత పాల్గొంటున్నారు. ఛాయాగ్రహణం సి. నాగేశ్వరరావు. కళ మారవ్వ, దర్శకుడు రజనీకాంత్.

* * *

లలితకళలా, రాజకీయాలా

(…వ పేజీ తరువాయి)

కుంటారా?

నా: ఇది చాల చిన్న ప్రశ్న గాని, జవాబు ఇవ్వాలంటే చాలా ఉంది; ఒక్కొక్క పాత్ర, ఒక్కొక్క చిత్రంలో ఒక్కొక్క తరహాగా ఉంటుంది. విభిన్న తత్వాలతో ఏవిధంగానూ, పోలిక, సందర్భం లేక భిన్నప్రకృతుల్లో ఉండే ఈ పాత్రలు నటుణ్ణి మానసికంగానూ, శారీరకంగాను మెలిపెట్టేసి అతని మేధస్సును ఎంత మథిస్తాయో చెప్పలేను. ఈ భిన్నప్రకృతిగల పాత్రల ప్రదర్శనలో నేనెంతజాగ్రత్తగా ఉన్నా ఎంత మెలకువతో ప్రవర్తించినా,



మద్రాసు నగరానికి మేయరుగా ఎన్నికలయిన ప్రథమ మహిళ శ్రీమతి తారా చెరియన్.

ఒక పాత్రయొక్క శక్తి, ప్రభావం మరొక పాత్రపై పడుతూనేఉంటాయి. ఆ సందర్భంలోనే ఆయా చిత్ర దర్శకులు నన్ను సరైన మార్గంలో పెడుతూ నాతో సహకరిస్తూ వచ్చారు.

మో: నాటకాల్లో డైలాగులన్నీ కంఠతా పెడతారుకదా; సినీమాల్లోకూడా అలాగే చేస్తూంటారా?

నా: తప్పకుండాను. నాటకాల్లో యింకా అప్పుడప్పుడు ప్రాంప్టర్ మీద ఆధారపడే సమయాలైనా ఉంటాయి; చిత్రాల్లో అదేమీ లాభంలేదు. పూర్తిగా డైలాగ్ వస్తేనే దానికి అనువైన హావ, భావ ప్రదర్శన, ఉచ్చారణలోని స్థాయిక్రమం బాగుంటేది.

మో: మీరు అటు కాశ్మీర్, ఇటు సింహళం పర్యటించారుగదా అక్కడ ఎవరైనా నిర్మాతలను కలుసుకున్నారా? మీ అనుభవాలు ఏమిటి?

నా: హిమాలయపర్వత శోభను తిలకిస్తూ, సుందరతరమైన కాశ్మీర్ లోయలు చూస్తూ, మధురానుభూతి పొందాను. ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ, సింహళీయుల అద్భుతమైన ఆతిథ్యయతను, వారి అతిథ్యాన్ని, అభిమానాన్ని చూరగొన్నాను. కేవలం విశ్రాంతి కోసం, మానసికానందంకోసం పర్యటించాను. ఎక్కడా నిర్మాతల్ని కలుసుకోలేదు, చిత్రపరిశ్రమ విషయం ప్రస్తావించలేదు.

మో: మీ రెప్పుడైనా హాలీవుడ్ వెళ్ళాలనుకుంటున్నారా?

నా: అనుకోవడమేమిటి? వెళ్లితీరాను. చిత్రపరిశ్రమకు జన్మస్థానం. అదీగాక అన్నిరంగాల్లోనూ, బాగా పురోగమించిన ఆ కళా కేంద్రం దర్శించాలని ఎవరికుండదు?

మో: మీరు ఇంగ్లీష్ చిత్రాలు కూడా చూస్తూ ఉంటారనుకుంటాను. వాటిని చూసి నటీనటులు నేర్చుకోవలసిన విషయాలేమయినా ఉంటాయంటారా?

నా: ఇంగ్లీష్ చిత్రాలు సాంకేతికంగా చాలా అభివృద్ధిచెందిన మాట వాస్తవం. వాళ్ళల్లో గొప్ప నటీనటులున్నారు. నటన, దేశకాల పాత్రలను బట్టి ఉన్నప్పటికీ వైవిధ్యం ఉంటుంది. సంప్రదాయాల కనుగుణంగా పాత్రను పోషించే సందర్భంలో నటుడు ప్రత్యేక కృషి చేయాలి. అనుకరించడం అంతటా కుదరదు.

మో: మీ అభిమాన ఇంగ్లీష్ నటీనటులు ఎవరు?

నా: చార్లెస్ బోయర్, గ్రెగరీపెక్, ఇంగ్రిడ్ బెర్గ్‌మన్.

మో: నటీనటులు కళాకారులుగా మాత్రమే ఉండాలా కాక రాజకీయాల్లో కూడా పాల్గొనడం మంచిదంటారా?

నా: రాజకీయ పరిజ్ఞానం ఉండటం అవసరమే గాని, రాజకీయాల్లో మునగడం మాత్రం మంచిది కాదనుకుంటాను. కళాసేవ తపస్సులాంటిది. ఏ మాత్రం చలించినా తపోభంగమయినట్లే. రాజకీయాల్లో, పార్టీలు, ముఠాలు, కక్షలూ తప్పవు. వీటి కన్నిటికీ అతీతమయిన కళాకారుడు తన కళ ద్వారా ప్రజాదరణ పొందగలుగుతాడు. దేశంలో రాజకీయ స్థైర్యం, ప్రజాజీవనంలో అభివృద్ధి గమనిస్తూ ఉండాలే గాని, ఎప్పటికీ రాజకీయాలలో దిగరాదు. కళాసేవ అతని జీవిత పరమావధి. తద్వారా ప్రజాసేవ, కళాకారుని కర్తవ్యం.

మోహన్: చాలా సంతోషం. సెలవండి నాగేశ్వరరావు—సెలవండి. ★

('వాయిస్ ఆఫ్ అమెరికా'లో ప్రసారితం)



ఫాక్స్ టెయిల్ ఫిలింస్ వారి 'స్నేహితులు' చిత్రంలో పాడుతున్న బి. ఎం. బాబు.